

దూసుకొచ్చిన మృత్యువు
పొట్టకూటి కోసం వలస వచ్చిన కూలీల గుడిసెలపైకి ఓ లారీ అతివేగంతో దూసుకెళ్లడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. 8లో



సరిహద్దులో పెద్దపులి
రాష్ట్ర సరిహద్దులో పెద్దపులి సంచారం కలకలం రేపింది. మొగుడంపల్లి మండలంలోని జాడీమల్కాపూర్‌లో ఆవు, లేగదూడలపై దాడిచేసి హతమార్చినట్టు అధికారులు గుర్తించారు. 8లో



ధరల పెంపుతో సామాన్యులపై భారం
పెరిగిన గ్యాస్ ధరలతో సామాన్యులపై భారం పడుతుందని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు జిల్లా వ్యాప్తంగా రోడ్లపై నిరసనలు తెలిపారు. 9లో..

న్యూస్‌రీల్

5కే రన్‌ను విజయవంతం చేయాలి

సీపీ శ్వేత



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ శ్వేత, అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, సీఐలు

సిద్దిపేటకమాన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేటలో ఈ నెల 8న నిర్వహించనున్న 5కే రన్‌ను విజయవంతం చేయాలని సీపీ ఎన్.శ్వేత తెలిపారు. సీపీ కార్యాలయంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, సీఐ భానుప్రకాష్, రవికుమార్‌లతో కలిసి 5కే రన్‌కు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఉదయం 6 గంటలకు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద రన్ ప్రారంభమవుతుందని, యువత పాల్గొనాలని కోరారు. పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.10వేలు, రూ.7,500, రూ.5వేల చొప్పున పురుషులు, మహిళలకు వేర్వేరు నగదు పురస్కారం అందిస్తామని పేర్కొన్నారు.

గ్రామ కంఠ భూముల సమస్య పరిష్కరిస్తాం

అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్



అంగడికిష్టాపూర్‌లో వివరాలను సేకరిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

మర్కూక్(గజ్వేల్): గ్రామ కంఠం భూముల సమస్యను త్వరలో పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ అన్నారు. మండలంలోని అంగడికిష్టాపూర్ గ్రామంలో గతంలో డ్రోన్ ద్వారా చేసిన సర్వే భూములను గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సమస్యలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల ప్రక్కన భూములకు గజాల్లో వ్యత్యాసాలు ఏర్పడుతున్నాయని, వాటిని సరిచేయాలని గ్రామస్తులు కోరారు. గ్రామ కంఠ భూముల్లో సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కరిస్తామని, వాటికి రిజిస్ట్రేషన్ చేసి పట్టాపాస్ పుస్తకాలను కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఓ దేవకిదేవి, డీఎల్‌పీఓ వేదావతి, ఏడీ సర్వేయర్ వినయ్, సర్పంచ్ లక్ష్మీ, ఉపసర్పంచ్ కొండల్‌రెడ్డి, ఎంపీటీసీ నరేందర్, కార్యదర్శి పాల్గొన్నారు.

తప్పనిసరిగా పరీక్ష రాయాలి

డీఐఈఓ సూర్యప్రకాశ్

సిద్దిపేటఎడ్యుకేషన్: ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు నైతికత, మానవ విలువలు, పర్యావరణ పరీక్షలు రాయాలని, లేదంటే ఫెయిల్ అవుతారని జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాశ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 4, 6వ తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఆయా కళాశాలల్లో పరీక్షలు ఉంటాయన్నారు. ఇందుకు సంబంధించిన హాల్‌టికెట్లను సంబంధిత కళాశాలలో తీసుకోవాలని సూచించారు. ప్రాక్టికల్స్ పరీక్షలకు జనరల్ విభాగంలో 7,396 మంది హారవగా, 309 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఒకేషనల్ ఫస్టియర్‌లో 8,146 మంది హాజరవగా, 1,669 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. సెకండియర్‌లో 7,299 హాజరవగా, 1,496 మంది పరీక్షు రాయలేదని పేర్కొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్: పదో వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, దుంపలపల్లి పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. పరీక్షల్లో ఎలా రాయాలో తెలియజేసేందుకు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అందించిన అభ్యసన దీపికలు, కేసీఆర్ డిజిటల్ కంటెంట్‌పై వివరించారు. ప్రతీ రోజు ప్రాక్టీస్, వీకెండ్ పరీక్షలు, ప్రీ ఫైనల్ అనంతరం ప్రశ్న పత్రాలను పరిశీలించుకోవాలన్నారు. అనంతరం హెచ్‌ఎంలతో సమావేశం ఏర్పాటు చేసి, ఉత్తీర్ణత పెంపునకు తీసుకుంటున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభుదాసు, హెచ్ఎంలు సత్యనారాయణరెడ్డి, గాజుల రాంచంద్రం, తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్‌ను కరీంనగర్‌లో కలుపుతాం

మూడుముక్కలు చేసి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, పక్కన పొన్నం, జీవన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, తదితరులు

హుస్నాబాద్: మంత్రి హరీశ్‌రావు బలవంతంగా హుస్నాబాద్ నియోజకవర్గాన్ని మూడు ముక్కలు చేసి ఈ ప్రాంత ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాడని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడోలో భాగంగా కట్కూర్ క్రాసింగ్ నుంచి హుస్నాబాద్‌కు 8కిలో మీటర్ల మేర పాదయాత్ర చేశారు. అనంతరం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గాన్ని మూడు ముక్కలుచేస్తే ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఏం చేశాడని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో కనీసం డిపాజిట్ కూడా రాదని అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని తిరిగి కరీంనగర్‌లోకి చేర్చాలంటే కాంగ్రెస్‌పార్టీ జెండాను ఎగురవేయాలన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కేంద్రం నుంచి రాష్ట్రానికి తెచ్చిన నిధులపై కాంగ్రెస్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌తో హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ గౌరవెల్లి నిర్వాసితులు పరిహారం చెల్లించాలని అడిగితే మహిళలు అని చూడకుండా సీఎం కేసీఆర్ పోలీస్‌లతో కొట్టించారని ఆరోపించారు. రిజర్వాయర్లకు సంబంధించిన భూములను కావేరి భాస్కర్ రావు ఎలా కట్టబెట్టారో చెప్పాలని ప్రశ్నించారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తన హయాంలో జరిగిన అభివృద్ధిలో ప్రస్తుత ఎంపీ 5 శాతం కూడా పనులు చేయలేదని అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు జానారెడ్డి, బలరాం నాయక్, మాజీ ఎంపీ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి ఉన్నారు.

గండిపెల్లిని మేమే పూర్తిచేస్తాం..

అక్కన్నపేట మండలం గండిపెల్లి ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రారంభించిందని, దానిని పూర్తి చేసే బాధ్యత కూడా తమేదనని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డితో కలిసి గండిపెల్లి ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం నిర్వాసితులు, రైతులతో మాట్లాడారు. హుస్నాబాద్ కరువు ప్రాంతమని, ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు 2007లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి తోటపల్లి, గౌరవెల్లి, గండిపెల్లి ప్రాజెక్టులకు పునాది వేశారన్నారు. సగం టీఎంసీ సామర్థ్యమున్న గండిపల్లి ప్రాజెక్టు కోసం భూ సేకరణ చేసి నష్టపరిహారం చెల్లించారని, కాంగ్రెస్ హయాంలో 70 శాతం పనులు పూర్తయినా, కేసీఆర్ నిర్లక్ష్యంతో ప్రాజెక్టు గుంతలా మారిందని విమర్శించారు. గండిపెల్లి ప్రాజెక్టును పూర్తి చేయకుండా మల్లన్నసాగర్, రంగనాయక సాగర్, కొండ పోచమ్మ ప్రాజెక్టులను ప్రారంభించి ఈ ప్రాంత రైతులపై వివక్ష చూపారన్నారు. జనవరి 1, 2024న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని, గండిపెల్లి ప్రాజెక్టును 6 నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాడని, రాజకీయ సన్యాసం పుచ్చుకోవాలని రేవంత్ రెడ్డి అన్నారు. పొన్నం ప్రభాకర్, ప్రవీణ్‌రెడ్డి, నర్సారెడ్డిలను గెలిపిస్తే ఆరు నెలల్లో గండిపెల్లి ప్రాజెక్టును పూర్తి చేసుకోవచ్చని సూచించారు. ఈ ప్రాంత ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ప్రజల సమస్యలు పట్టించుకోవడంలేదని, గండిపెల్లి ప్రాజెక్టు కింద పట్టా భూములను, సీలింగ్ భూములుగా మార్చి దళితబంధు ఇవ్వకుండా ప్రభుత్వమే ఆ భూములను ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు.

పునరావాస ప్యాకేజీ ఇవ్వాల్సిందే

అక్కన్నపేట(హుస్నాబాద్): సీఎం కేసీఆర్ వియ్యంకుడికో న్యాయం? గౌరవెల్లి ప్రాజెక్టు గుడాటిపల్లి భూ నిర్వాసితుల వివాహిత మహిళలకో న్యాయమా? అని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. హాథ్ సే హాథ్ జోడోలో భాగంగా గురువారం అక్కన్నపేట మండలం అంతక్కపేట శివారు కట్కూర్ క్రాస్ వద్ద వివాహిత మహిళలు రేవంత్‌ను కలిశారు. పునరావాస ప్యాకేజీ ఇప్పిస్తామని చెప్పిన ఎమ్మెల్యే ప్రస్తుతం పట్టించుకోవడం లేదని, రూ.20లక్షలకు బదులుగా రూ.12.54లక్షలు మాత్రమే ఇస్తామని చెబుతున్నారని వాపోయారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మిడ్‌మానేరులో సీఎం వియ్యంకుడి ఆడబిడ్డలకు ఇచ్చినట్లు ఇక్కడి మహిళలకు కూడా పునరావాస ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చట్టప్రకారం తండ్రి ఆస్తిలో ఆడబిడ్డలకు సమాన హక్కులు ఉంటాయని, పరిహారం చెల్లించకుండా వారిని అరెస్టు చేయించడం దారుణమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాగానే పరిహారం అందిస్తామని భరోసా ఇచ్చారు. అంతక్కపేట గ్రామ శివారులోని కట్కూర్ క్రాస్ నుంచి గండిపల్లి ప్రాజెక్టు వైపు వెళుతుండగా అక్కన్నపేట, కుందనవానిపల్లి వద్ద మహిళలు రేవంత్‌రెడ్డికి బొట్టుపెట్టి స్వాగతం పలికారు.

చేపలు పట్టే హక్కు మత్స్యకారులకే

ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



సమీక్షలో మంత్రి హరీశ్ రావు

సిద్దిపేటజోన్: జిల్లాలోని రిజర్వాయర్లలో చేపలు పట్టే హక్కును మత్స్యకారులకు కల్పిస్తున్నట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. గురువారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, సీపీ శ్వేత, ఇరిగేషన్ ఈఈ గోపాలకృష్ణ, మత్స్యశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగనాయక సాగర్, అంతగిరి రిజర్వాయర్‌లో చేపలు పట్టుకునేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని అన్నారు. అర్హులైన మత్స్యకారులను గుర్తించి, వెంటనే గుర్తింపు కార్డులను పంపిణీ చేయాలని మత్స్యకార శాఖ అధికారికి ఆదేశించారు. 58, 59 జీఓలకు సంబంధించి లబ్ధిదారులతో డీడీలు కట్టించి పట్టాలు పంపిణీకి సర్వం సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు, గిరిజనుల అన్యాయం జరుగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌కు సూచించారు.

లక్ష్యం మేరకు పనిచేయాలి

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా ఆయిల్ ఫాం మొక్కల పెంపకం ఈ ఏడాది లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు పని చేయాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆదేశించారు. గురువారం కలెక్టర్‌లో వ్యవసాయ-ఉద్యానవన శాఖ, ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ అధికారులు, ఏఓ, ఏడీఓ, ఏఈఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్ ఫాం సాగులో పురోగతికి కోసం రైతులకు అవగాహన కల్పించాలని, మార్చి 31 లోపు లక్ష్యం చేరుకునేలా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి ఎంచుకున్న వ్యవసాయ క్షేత్రాన్ని డీడీ-పేమెంట్ కాగానే భూమిని చదును చేసి మార్కింగ్, ట్రెంచింగ్ చేయించాలన్నారు. ఆయిల్ ఫెడ్ అధికారులు కొఠారి, జైన్, గ్లోబల్ తదితర కంపెనీలతో పరికరాలను సమకూర్చుకోవాలన్నారు. పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్య లు తప్పవని హెచ్చరించారు. దుబ్బాక మండలంలో పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయిల్ ఫెడ్ మేనేజర్ సుధాకర్ రెడ్డికి సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఉద్యాన వన శాఖ అధికారి రామలక్ష్మి పాల్గొన్నారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.కోటి 5లక్షలు



హుండీని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, శివశక్తి సేవాసమితి సభ్యులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.రూ.1,05,05,006 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి బాలజీ తెలిపారు. గురువారం స్వామి వారి ఆలయ ముఖ మండపంలో డివిజన్ ఇన్‌స్పెక్టర్ రంగరావు, సిద్దిపేట కోటిలింగేశ్వర ఆలయ ఈఓ రవికుమార్ ఆధ్వర్యంలో 29 రోజుల్లో భక్తులు వేసిన కానుకలను లెక్కించారు. నగదు రూ.1,05,05,006, విదేశీ కరెన్సీ నోట్లు 31, మిశ్రమ బంగారం 139 గ్రాములు, మిశ్రమ వెండి 9.5కిలోలు, పసుపు బియ్యం 29.50క్వింటాళ్లు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. నగదును బ్యాంక్‌లో జమ చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ అంజయ్య, ఆలయ ధర్మకర్తలు బుచ్చిరెడ్డి, సౌజన్య, ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, పోలీసులు, ఆలయ సిబ్బంది అంజయ్య, శ్రీనివాస్, మాధవి, శివరామకృష్ణ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

పునరావాస ప్యాకేజీ చెక్కు అందజేత

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం గౌరవెల్లి ప్రాజెక్టు గుడాటిపల్లి గ్రామం కింద ముంపునకు గురైన సేవ్యతండా, జాలుబాయితండా, బొంద్యతండా, తిరుమల్‌తండా, చింతల్‌తండాల గిరిజన నిర్వాసితులకు మంజూరైన ప్రత్యేక పునరావాస ప్యాకేజీ చెక్కులను గురువారం తహసీల్దార్ సంజీవ్‌కుమార్ పంపిణీ చేశారు. ఆర్డీఓ కార్యాలయంలో 10 గిరిజనులకు ఒక్కో కుటుంబానికి రూ.12,54,000 విలువ గల చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ఆర్ఐ రాజు, గుడాటిపల్లి ఎంపీటీసీ బైరి రవీందర్, మాజీ జెడ్పీటీసీ మాలోతు భీలునాయక్, రెవెన్యూ సిబ్బంది కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5న ప్రవేశ పరీక్ష

సిద్దిపేటఅర్బన్: 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ), గురుకుల డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్స్‌కు ఈనెల 5, ఆదివారం రోజు పరీక్ష నిర్వహించనున్నట్లు మెదక్ ఈస్ట్ రీజినల్ కోఆర్డినేటర్ నిర్మల తెలిపారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. సీఓఈ పరీక్ష ఉదయం 10 నుంచి 1గంట వరకు, డిగ్రీ గురుకుల ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2:30 నుంచి 5గంటల వరకు జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

త్వరలో గౌరవెల్లిని నింపుతాం

- హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



హుస్నాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఒక తుపాకి రాముడని, ఎగౌరవెల్లి ప్రాజెక్టు పనులు పూర్తి కావడాన్ని జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. గురువారం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ సాధించిన ప్రగతి, అభివృద్ధిపై రేవంత్ రెడ్డి అవహేళనగా మాట్లాడటం సిగ్గుచేటని, గౌరవెల్లి ప్రాజెక్టును కాంగ్రెస్ అడ్డుకునే ప్రయత్నం చేసిందని గుర్తుచేశారు. గండిపెల్లి ప్రాజెక్టు భూ సేకరణ పూర్తయిందని, త్వరలోనే గండిపెల్లి ప్రాజెక్టు పనులను ప్రారంభిస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గండిపెల్లి, గౌరవెల్లి ప్రాజెక్టులు మొదలు పెట్టినప్పుడు 1.5 టీఎంసీల సామర్థ్యం మాత్రమేనని, సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో గౌరవెల్లి ప్రాజెక్టును 8.23 టీఎంసీలకు పెంచి, 1.07లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నారని అన్నారు. 4వేల ఎకరాల భూ సేకరణ పూర్తయిందని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రూ.8లక్షల ప్యాకేజీ ఇప్పించామని తెలిపారు. సర్వేఖాస్ భూములు ఉన్నవారికి పట్టా భూములు ఉన్నవారితో సమానంగా పరిహారం అందించామన్నారు.

నయా లుక్ ఇంకెప్పుడో?

- సుందరీకరణ పనులు ఆలస్యం
- ఎనిమిది జంక్షన్లల్లో రెండే అభివృద్ధి
- నిధులున్నా ముందుకు సాగని వైనం



పనులు చేపట్టాల్సిన ఇందిరాపార్కు జంక్షన్ ఇదే

గజ్వేల్: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి నయా లుక్ తీసుకువచ్చేందుకు ప్రారంభించిన పనులు ముందుకు సాగడంలేదు. మహనీయుల విగ్రహాలు, సర్కిళ్లలో అదనపు అందాలు, వాటర్ ఫౌంటేయిన్ల కనువిందు, అమరుల సర్కిల్, ×లవ్ జీపీపీ₹ స్వాగతాల పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. అభివృద్ధిలో భాగంగా చేపట్టే పనుల్లో తమ దుకాణాలు, షాపుల స్థలం కోల్పోవాల్సి వస్తుందని కొంతమంది స్థానిక నేతలు అడ్డు పడుతుండడంతో పనులకు బ్రేక్ పడుతుంది. పట్టణంలో ఎనిమిది జంక్షన్లను అభివృద్ధి చేయాల్సి ఉండగా ఇప్పటివరకు రెండింటిని మాత్రమే పూర్తి చేశారు. దీంతో రూ.2కోట్ల నిధులు ఉన్నా పనులు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రతిపాదనలు..

సీఎం కేసీఆర్ చొరవతో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి నమూనాగా మారింది. ఇక్కడ నిర్మించిన రింగు రోడ్డు, ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్, మహతి ఆడిటోరియం, అర్బన్ పార్కు, పాండవుల చెరువు సుందరీకరణ, రోడ్ల విస్తరణ, ఎడ్యుకేషన్ హబ్ తదితర పనులు విమర్శకుల మన్ననలను చూరగొన్నాయి. పట్టణానికి మరింత శోభ తెచ్చేందుకు మున్సిపల్ పాలకవర్గం ఏడాది క్రితం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో పట్టణంలో మహనీయుల విగ్రహాల సర్కిళ్లను అందంగా తీర్చిదిద్ది, వాటర్ ఫౌంటేయిన్లు, లవ్ జీపీపీ స్వాగత ద్వారాలను ఏర్పాటును చేసేందుకు రూ.2కోట్లు మంజూరు చేశారు. ప్రజ్ఞాపూర్, పిడిచెడ్ రోడ్డు చౌరస్తా, అంబేద్కర్ సర్కిల్, ఇందిరాపార్కు చౌరస్తా, జాలిగామ బైపాస్ రోడ్డు చౌరస్తా, బాబుజగ్జీవన్‌రామ్ వై జంక్షన్, ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ సర్కిల్, ముట్రాజ్‌పల్లి సర్కిళ్లను అందంగా తీర్చిద్దిడానికి సంకల్పించినా, ఇంకా ప్రతిపాదన దశలోనే ఉన్నాయి.

పనుల్లో ఆలస్యం..

పట్టణ సుందరీకరణ పనుల్లో భాగంగా ఎనిమిది జంక్షన్లలో కేవలం అంబేడ్కర్ చౌరస్తా, తూప్రాన్ రోడ్డు వై జంక్షన్ పనులను మాత్రమే పూర్తి చేశారు. స్థానిక నాయకులు అడ్డుపడుతుండడంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడంలేదనే విమర్శలు ఉన్నాయి. ఇందిరాపార్కు చౌరస్తాలో జంక్షన్ అభివృద్ధికి రోడ్డు విస్తరణ చేయాల్సి ఉండగా, విస్తరణలో తమ భవనాలను కోల్పోవాల్సి వస్తుందని నేతలు ఈ ప్రతిపాదనను పక్కనపెట్టారనే ఆరోపణలున్నాయి. ఈ అంశంపై అసమ్మతి కౌన్సిలర్లు ఆరోపణలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ప్రధానమైన జంక్షన్ పనులు మొదలు కాకపోవడంతో ప్రజ్ఞాపూర్ చౌరస్తా వద్ద లవ్ జీపీపీ ఏర్పాటు పనులు కూడా పెండింగ్‌లో పడ్డాయి. ఇందిరాపార్కు చౌరస్తాతో పాటు మిగితా జంక్షన్‌ల వద్ద పనులపై పాలకవర్గంలో ఏకాభిప్రాయం కుదరకపోవడం కూడా పనులు నిలిచిపోవడానికి మరో కారణం. ఈ వ్యవహారంపై మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళిని వివరణ కోరగా... పట్టణానికి కొత్త శోభ తీసుకురావడానికి చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్నామని, ఈ అంశంపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం రెండు జంక్షన్ల పనులు పూర్తయ్యాయని, త్వరలో మిగితావి కూడా పూర్తి చేస్తామని తెలిపారు.

కార్మికుల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

గజ్వేల్‌రూరల్: కార్మికుల సంక్షేమమే సీఐటీయూ లక్ష్యమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు తెలిపారు. ప్రజ్ఞాపూర్ శివారులోని రాణే బ్రేక్ లైనింగ్స్(ఆర్‌బీఎల్) పరిశ్రమలో కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. మొత్తం 160 ఓట్లలో సీఐటీయూకు 95 ఓట్లు పోలయ్యాయి. ఈ సందర్భంగా ఆర్‌బీఎల్ పరిశ్రమ నుంచి గజ్వేల్ పట్టణం అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చుక్క రాములు, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ మాట్లాడారు. కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం మంచి వేతన ఒప్పందం చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, కార్యదర్శి గోపాలస్వామి, ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, యూనియన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ భిక్షపతి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, వెంకట్రావ్, రంగారెడ్డి, మల్లయ్య, నర్సింలు, శివయ్య, రవికుమార్, కుత్బుద్దీన్, సాజిద్, రమేష్, పోశయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

వివాహిత అదృశ్యం

పటాన్‌చెరుటౌన్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన సోపాన్ ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఫిబ్రవరి 1వ తేదీన భార్యాభర్తలు సంగీత, సోపాన్ గొడవపడ్డారు. 25వ తేదీన భర్త డ్యూటీకి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. ఇంటిలో భార్య కనిపించలేదు. తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ ఏసీబీల హల్‌చల్

మనోహరాబాద్ (తూప్రాన్): మనోహరాబాద్‌కు చెందిన నింగప్ప తుక్కు దుకాణం నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి సలాకను గుర్తు తెలియని వ్యక్తి నుంచి అక్రమంగా కొనుగోలు చేశాడు. ఇది గమనించిన ముగ్గురు డబ్బులు ఇవ్వకపోతే నీపై కేసు నమోదు చేస్తామని బెదిరించారు. దీంతో వారికి రూ.8 వేలు ఇచ్చాడు. మళ్లీ మరుసటి రోజు 9014399960 నంబర్ నుండి కాల్ చేసి మిగతా డబ్బులు ఇవ్వమని బెదిరించారు. వారు చేసిన ఫోన్ నంబర్ ని ట్రూ కాలర్ లో పరిశీలించగా ఇంటర్నేషనల్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ బ్యూరో టిఎస్ వీరబోయిన మహేందర్ మహేష్ చూపించింది. తనను బెదిరించి డబ్బులు వసూలు చేసిన ముగ్గురిపై చర్యలు తీసుకోవాలని నింగప్ప ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో జరిమానా, జైలు

సిద్దిపేటకమాన్: పోక్సో కేసులో నిందితులకు కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించింది. గురువారం సిద్దిపేట వన్‌టౌన్ సీఐ భిక్షపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేటలోని నాసర్‌పూరకు చెందిన మామిండ్ల అఖిల్, దాసరి శ్రీధర్ ఓ అమ్మాయి వెంట పట్టపడ్డారు. ప్రేమిస్తున్నామని, ప్రేమించకపోతే చంపేస్తామని బెదిరించడంతో వారిపై ఆమె సిద్దిపేట వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో 2021 నవంబర్ 30వ తేదీన ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ శ్రీధర్‌గౌడ్ కేసు నమోదుచేసి ఇద్దరి అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. గురువారం వారిని కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో నిందితులకి సిద్దిపేట ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ సెషన్స్ కోర్టు జడ్జి మూడేళ్ల జైలు, రూ.4 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

పోలీసులకు ఫిర్యాదు

సిద్దిపేటకమాన్: ఇంటిలో పెంచుకుంటున్న కుక్కపిల్ల, కోళ్లను గుర్తు తెలియని వ్యక్తులు చంపారు. ఈ సంఘటన సిద్దిపేట పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట హౌసింగ్ బోర్డు కాలనీలో పోషవ్వ నివాసం ఉంటుంది. కుక్కపిల్ల, కోళ్లను పెంచుకుంటుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వాటిని చంపారని బాధితులు వాపోయారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళ అనుమానాస్పద మృతి

పాపన్నపేట(మెదక్): అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందింది. గురువారం ఎస్‌ఐ విజయ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కుర్తివాడ గ్రామానికి చెందిన సార భాగవ్వ(38)ను 17 ఏళ్ళ క్రితం కొడుపాకకు చెందిన బాజిరి భూమయ్యకు ఇచ్చి పెళ్లి చేశారు. వారికి ఒక కూతురు జన్మించింది. భూమయ్య మరణించడంతో భాగవ్వ పుట్టింటికి చేరింది. అదే గ్రామానికి చెందిన పట్నం విఠల్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. వీరిద్దరు సహజీవనం చేస్తున్నారు. బుధవారం రాత్రి భాగవ్వను పాలు తీసుకురావాలని చెప్పడంతో ఆమె వెళ్లి పాలు తెచ్చింది. అయితే విఠల్ తలుపు గడియ పెట్టుకొని తీయలేదు. కొద్దిసేపటి తర్వాత తలుపు తీసి చూసే సరికి భాగవ్వ ఉరివేసుకుని కనిపించింది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. విషయం తెలిసిన వెంటనే భాగవ్వ కుటుంబీకులు ఆందోళనకు దిగారు. దీంతో విఠల్ తరపు వారు, గ్రామపెద్దలు బాధితులను సముదాయించి మృతురాలి కుమార్తెకు బాసటగా ఉంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్ తెలిపారు.

బైరి నరేశ్‌పై ఫిర్యాదు

సిద్దిపేటకమాన్: హిందూ సాంప్రదాయాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేశ్ బెయిల్ రద్దు చేసి, పీడీ యాక్టు విధించాలని విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హిందూ దేవుళ్ల, సాంప్రదాయాలపై అనుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- ముగ్గురి ప్రాణం తీసిన అతి వేగం
- ఓఆర్ఆర్ రెయిలింగ్‌ను ఢీకొని గుడిసెలోకి దూసుకువెళ్లిన లారీ
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వలస కూలీల దుర్మరణం



రింగ్ రోడ్డు పైనుంచి గుడిసెల్లోకి దూసుకు వెళ్లిన లారీ



బసప్ప రాథోడ్ (ఫైల్)



బాబు రాథోడ్- కమలవ్వ దంపతులు (ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పొట్టకూటి కోసం వలస వచ్చిన కూలీల గుడిసెలపైకి ఓ లారీ అతివేగంతో దూసుకెళ్లింది. దీంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు రింగ్ రోడ్డు వద్ద గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, మృతుల బంధువుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా జింకేరతండా చెందిన 40 కుటుంబాలను ఔటర్‌రింగ్ రోడ్డుపై మొక్కలు నాటడం, వాటి నిర్వహణకు ఓ కాంట్రాక్టర్ తీసుకొచ్చాడు. ఓఆర్ఆర్‌కు సర్వీస్ రోడ్డుకు మధ్యలో మొక్కలు పెంచే ప్రదేశంలో వారు గుడిసెలు వేసుకొన్నారు. కాగా గురువారం తెల్లవారుజామున హర్యానా నుంచి ఏపీలోని చిత్తూరుకు నిత్యావసర సరుకులతో ఓ లారీ వెళుతోంది. డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటంతో లారీ కొల్లూరు సమీపంలో ఔటర్ రింగ్ రోడ్డు సేఫ్టీ రెయిలింగ్‌ను ఢీ కొట్టి రింగ్‌రోడ్డును ఆనుకొని మొక్కలు నాటే ప్రదేశంలో ఉన్న వలస కూలీల గుడిసెలపైకి వెళ్లింది. దీంతో గుడిసెలో నిద్రిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన బాబు రాథోడ్ (48) అతడి భార్య కమలవ్వ (43), వారి కుమారుడు బసప్ప రాథోడ్ (23) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనస్థలానికి చేరుకొని గుడిసెలపై పడ్డ లారీని క్రేన్ సాయంతో తొలగించారు. మృతులు బాబు రాథోడ్, కమలవ్వ దంపతులకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె. వీరిలో చిన్న కుమారుడు బసప్ప తల్లిదండ్రులతోనే ఉంటున్నాడు. మిగిలిన ముగ్గురు కుమారులు గోపాల్, సంతోష్, రెడ్యా ముంబైలో ఉంటున్నారు. రెండు నెలల క్రితమే జీవనోపాధి కోసం వలస వచ్చి ముగ్గురూ మృతి చెందడంతో అక్కడ నివసిస్తున్న తండావాసులు కన్నీరుమున్నీరయ్యారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పటాన్‌చెరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటనస్థలాన్ని మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి, ఏసీపీ నరసింహారావు, ఎంపీఐ రాజ మహమ్మద్, సీఐ సంజయ్‌కుమార్ సందర్శించారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కూడా సంఘటన స్థలాన్ని సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు.

ఇదే చోట గతంలోనూ ప్రమాదాలు

మితిమీరిన వేగం, నిద్రమత్తుతో భారీ వాహనాలు ఔటర్ రింగ్ రోడ్డు నుంచి సర్వీస్ రోడ్డుపైకి దూసుకొచ్చిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ విషయాలు తెలిసినా అధికారులు గుడిసెల విషయం ఎందుకు పట్టించుకోలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ ఉండటం ప్రమాదకరమని పలువురు కూలీలు ఇక్కడి వచ్చిన సమయంలో సిబ్బందిని ప్రశ్నిస్తే గతంలో అనేకమంది కూలీలు ఇదే మాదిరి గుడిసెలు వేసుకున్నారని, వారికి జరగని ప్రమాదం మీకెందుకు జరుగుతుందని కూలీలతో అన్నట్లు ఓ కూలీ వాపోయాడు. గతంలో వలస కూలీలు ఇదే విధంగా గుడిసెలు వేసుకొని ఉండటంతో ట్రాఫిక్ పోలీస్ అధికారులు వారిని హెచ్చరించారు. అయితే కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు సైతం బేఖాతర్ చేయడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాం

తెల్లావారుజామున పెద్ద శబ్దం వచ్చింది. లేచి చూసే సరికి మా గుడిసెల పైకి లారీ దూసుకొచ్చింది. భయంతో పిల్లలను తీసుకోని బయటకు వచ్చాం.ఇక్కడ గుడిసెలు వేసుకొని అందరం నివసిస్తున్నాం. ఈ ప్రాంతం ఇంత ప్రమాదకరమని మాకు ఎవరు చెప్పలేదు.

– గోవింద్, కర్ణాటక వాసి

గతంలోనే హెచ్చరించారు

ఇలా గుడిసెలు వేసుకొని నివసించడం ప్రమాదకరమని గతంలో ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– పి.నరసింహ రావు, ఏసీపీ మియాపూర్

ప్రభుత్వం తరఫున ఆదుకుంటాం

ఇలాంటి సంఘటన జరగడం చాలా బాధాకరం. మృతుల కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.50 వేలు అందించాం. ప్రభుత్వం తరఫున ఆదుకుంటాం. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఇలాంటి నివాసాలు ఉంటే వారిని సురక్ష ప్రాంతాలకు తరలించాలని అధికారులను కోరుతున్నాం.

– గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్యే

ఉద్యోగం పేరిట రూ.1.02 లక్షలకు టోకరా

నారాయణఖేడ్: ఉద్యోగం పేరిట సైబర్ నేరగాళ్లు ఓ యువకుడికి రూ.1.02 లక్షల టోకరా వేశారు. ఖేడ్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి గురువారం తెలిపిన వివరాల ప్రకారం ఖేడ్ పట్టణానికి చెందిన పి.మహేశ్ అనే యువకుడు ఆమెజాన్ కంపెనీలో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఆ డేటాను సైబర్ నేరగాళ్లు తీసుకుని నరేశ్‌కు ఫోన్‌చేసి మీరు ఉద్యోగానికి ఎంపికయ్యారని చెప్పి వాట్సాప్‌లో వివరాలు పంపాలని ఓ లింకు పంపారు. బాధితుడు ఆ లింకును ఓపెన్ చేసి వివరాలతోపాటు డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేశాడు. ప్రాసెసింగ్ ఫీజు, విచారణ, బీమా పేరిట ఆరు విడతలుగా పేటీఎం ద్వారా రూ.1.02 లక్షలు తమ ఖాతాల్లో వేయించుకున్నారు. మళ్లీ డబ్బులు వేయాలని చెబుతుండటంతో మోసపోయినట్లు గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

యండమూరికి తృటిలో తప్పిన ప్రమాదం

కొండపాక(గజ్వేల్): రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రముఖ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్‌కు గురువారం రాత్రి తృటిలో ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి సొంత వాహనంలో పెద్దపల్లి జిల్లా రామగుండం వెళుతున్నారు. ఈక్రమంలో మెదక్ జిల్లా కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులోకి రాగానే వీరేంద్రనాథ్ వెళుతున్న వాహనం వెనుక టైరు పగిలింది. దీంతో హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న సూపర్‌లగ్జరీ ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో వాహనం స్వల్పంగా దెబ్బతింది. వాహనంలో ఉన్న యండమూరి వీరేంద్రనాథ్ క్షేమంగా బయటపడ్డారు.

కుంట శిఖం భూమి కబ్జాకు యత్నం

అడ్డుకున్న తండావాసులు, అధికారులు



బద్యాతండా కుంటకు సంబంధించి పేపర్లు చూపుతున్న సర్వేయర్ రవిప్రసాద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): కుంట శికం భూమిని కబ్జా చేసేందుకు పలువురు ప్రయత్నించగా తండావాసులు అడ్డుకున్నారు. ఈ విషయాన్ని అధికారులకు తెలియజేయడంతో వారు ఘటన స్థలానికి వచ్చి గురువారం శిఖం భూమిని సర్వే చేశారు. సర్వేయర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చిట్కుల్ గ్రామానికి చెందిన పంతులు పండరి, నర్సింలు పక్కనే ఉన్న బద్యా తండాలోని జిల్లా కుంట శిఖం భూమిని కబ్జా చేసేందుకు యత్నించారు. తండాలోని 202 సర్వే నంబర్‌లో జిల్లా కుంట ఉంది. పక్కనే పండరి, నర్సింలు భూములు ఉండటంతో, కుంట శిఖం భూమిని ట్రాక్టర్‌తో చదును చేయించారు. ఇది తండావాసులు గమనించారు. ఆ శిఖం భూమిలో ఉపాధి హామీ పనులు కూడా చేశామని, దానిని ఎలా చదును చేస్తారంటూ సర్పంచ్ బుజ్జిబాయికి విషయం తెలిపారు. ఆమె ముందుగా ఘటన స్థలానికి వీఆర్ఏలను పంపించి, విషయాన్ని రెవెన్యూ సిబ్బందికి తెలియజేశారు. స్పందించిన తహసీల్దార్ ముసాద్దిక్, సర్వేయర్ రవిప్రసాద్ ఘటన స్థలానికి పంపించారు. దాంతో సర్వే చేసిన సర్వేయర్ రవిప్రసాద్ 10.06 ఎకరాలు కుంట శిఖం భూమేనని తేల్చారు. అనంతరం కబ్జాదారులను పిలిపించి కుంట శిఖం కబ్జా చేయడం నేరమని, మరోసారి యత్నిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా కబ్జాదారులు ఆ భూమి తమది అనడంతో సంబంధిత కాగితాలు తీసుకురావాల్సిందిగా సూచించామన్నారు.

అనారోగ్యంతో మహిళ మృతి

- నిర్లక్ష్యంగా వైద్యం చేశారని బంధువుల ఆందోళన
- తమ తప్పేమి లేదన్న ఆస్పత్రి నిర్వాహకులు

నర్సాపూర్: వైద్యం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మహిళ మృతి చెందిందని మృతురాలి బంధువులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన గురువారం నర్సాపూర్‌లో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. హత్నూర మండలం కొడిప్యాకకు చెందిన సరిత(21)కు వాంతులు, విరేచనాలు కావడంతో బుధవారం నర్సాపూర్‌లోని ఓ ప్రైవేటు నర్సింగ్ హోంలో చికిత్స పొందింది. చికిత్సలో భాగంగా ఆమె గర్భవతి కావడంతో స్కానింగ్ చేయించుకోవాలని డాక్టర్ సూచించింది. సాయంత్రం ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లింది. మరుసటి రోజు తెల్లవారు జామున చూసేసరికి సరిత చనిపోయి ఉందని కుటుంబీకులు ఆరోపించారు. మృతదేహంతో వచ్చి ఆందోళనకు దిగారు. ఎస్‌ఐ శివకుమార్, మున్సిపాల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్, పలువురు నాయకులు వచ్చి జరిగిన విషయం తెలుసుకున్నారు. అనంతరం వారు నర్సింగ్‌హోం నిర్వాహకురాలు డాక్టర్ భార్గవితో వారు మాట్లాడారు. వైద్యం చేయడంలో తమ తప్పేమి లేదని బదులిచ్చారు.

షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం

కౌడిపల్లి(నర్సాపూర్): షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమైంది. ఈ సంఘటన గురువారం జరిగింది. మండలంలోని కూకుట్లపల్లి గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జెజ్జరి నర్సింహులు కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఇంటికి తాళంవేసి అత్తగారింటికి వెళ్లాడు. గురువారం పక్కింటి జెజ్జరి సత్యనారాయణ, ఎల్లవ్వ పనులకు వెళ్లారు. నర్సింలు ఇంటి నుంచి ఒక్కసారిగా మంటలు, పొగ రావడంతో ఇల్లు కాలిపోతున్నట్లు గ్రామస్తులు గమనించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. కాగా అప్పటి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. అల్మారాలోని దాచిన రూ 10 వేల నగదు, బట్టలు, నిత్యావసర వస్తువులు బూడిదయ్యాయి. మంటలు వ్యాపించకుండా గ్రామస్తులు ఇంటికి ఆనుకుని ఉన్న గోడలతో పాటు పెంకుల తొలగించారు. ఈ ప్రమాదంలో పక్కనే ఉన్న సత్యనారాయణ, ఎల్లమ్మ ఇళ్లకు సైతం నష్టం జరిగింది. తహసీల్దార్ కమలాద్రి సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేశారు. కరెంట్ మీటర్‌లో షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం సంభవించిందని బాధితుడు తెలిపారు.

కూర్చున్న చోటే కుప్ప కూలాడు

- గుండెపోటుతో కిందపడిన కార్మికుడు
- చికిత్స కోసం ఆస్పత్రికి తరలింపు
- అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించిన వైద్యులు



శ్రీనివాసరాజు మృతదేహం

పటాన్‌చెరు టౌన్: టిఫిన్ చేసేందుకు ఓ కార్మికుడు కుర్చీలో కూర్చున్నాడు. ఒక్కసారిగా కిందపడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడు. ఈ సంఘటన బానూర్ బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సాయిలు కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. కేపీహెచ్‌పీ ప్రగతినగర్‌కు చెందిన గోకరాజు శ్రీనివాసరాజు(57) వెల్జన్ న్యూమటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో గత 20 సంవత్సరాలుగా సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగా గురువారం ఉదయం జనరల్ షిఫ్ట్ కి వచ్చి తన చాంబర్లో టిఫిన్ చేసేందుకు కుర్చీలో కూర్చున్నాడు. ఒక్కసారిగి కిందపడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరిశీలించిన వైద్యులు అప్పటికే చెందినట్లు తెలిపారు.

ఇద్దరి ఆత్మహత్య

వ్యక్తిగత కారణాలతో ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అనారోగ్యంతో ఒకరు. ఆర్థిక ఇబ్బందులతో మరొకరు బలవన్మరణం పొందారు.



యాదమ్మ (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): అనారోగ్యంతో ఆత్మహత్యకు పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కౌడిపల్లి మండలం కొట్టాల గ్రామానికి చెందిన చాకలి రాజు భార్య యాదమ్మ(39) కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెంది ఫిబ్రవరి 26వ తేదీన ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు మంటలను ఆర్పి చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురు వారం మృతి చెందింది. మృతురాలి మామ నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిజాంపేట(మెదక్): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నిజాంపేట మండల పరిధి కల్వకుంటలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంపేట మండల పరిధి కల్వకుంట గ్రామానికి చెందిన మంగిలిపల్లి శంకర్(52) హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో ఉంటున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. స్వగ్రామానికి వచ్చి ఇంటిని అమ్మకం పెట్టాడు. గురువారం సాయంత్రం తాను అమ్మిన ఇంటిలో ఉరివేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు తెలిపారు. ఏఎస్‌ఐ ప్రతాప్ శవపంచానామా చేసి మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మందుబాబుకు జైలు

వర్గల్(గజ్వేల్): మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించింది. గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఫిబ్రవరి 28వ తేదీన చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఇటిక్యాలకు చెందిన బి.కనకయ్య మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. గురువారం గజ్వేల్ కోర్టులో హాజరుపరచగా అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ బి.ప్రియాంక కనకయ్యకు ఐదు రోజుల జైలు శిక్ష విధించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృత్యువాత పడ్డారు. కూరగాయలు అమ్మి ఇంటికి వచ్చే క్రమంలో రైతు పొలానికి వెళ్లాడు. అక్కడ రోడ్డు దాటుతున్న సమయంలో వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. మరోచోట బంధువుల వేడుకకు వెళ్లి తిరిగి నడిచి వస్తున్నాడు. వాహనం ఢీకొని మరణించాడు.



రాజయ్య (ఫైల్)

మెదక్ రూరల్: కూరగాయలు అమ్మేందుకు వెళ్లిన ఓ రైతు బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. ఈ సంఘటన మెదక్ మండలం పాతూర్ శివారులో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హవేళిఘణాపూర్ మండలం శమ్నాపూర్ గ్రామానికి చెందిన రాజయ్య(48) వ్యవసాయం చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం 4 గంటలకు తన పొలంలో పండిన కూరగాయాలను అమ్ముకునేందుకు సమీప గ్రామమైన పాతూర్‌కు వెళ్లాడు. రాత్రి 7 గంటల వరకు కూరగాయలు విక్రయించి ఇంటికి వెళ్లేందుకు తమ గ్రామానికి చెందిన మైలి శంకర్ ఆటోలో తిరుగుప్రయాణమయ్యాడు. కాగా రాజయ్య మార్గమధ్యలోనే తన పొలానికి వెళ్లి వస్తా అంటూ పాతూర్ గ్రామ శివారులోని రైస్ మిల్ వద్ద ఆటో దిగి రోడ్డు దాటే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. ఇదే సమయంలో మెదక్ వైపు నుంచి వస్తున్న టీఎస్ 35 ఎఫ్ 4245 నంబర్ గల బైక్ రాజయ్యను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజయ్యతో పాటు గంగాపూర్ తండాకు చెందిన ద్విచక్రవాహన దారుడు మోదియా, అతడి తల్లి జాలికి సైతం గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజయ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి కుమా రుడు బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



నర్సింలు (ఫైల్)

పాపన్నపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని కుర్తివాడలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మన్నె నర్సింలు(72) వ్యవసాయం చేస్తున్నాడు. గత నెల 21వ తేదీన నాగ్సాన్‌పల్లి శివారులో ఉన్న ఓ ఫంక్షన్ హాల్ జరిగిన విందుకు కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యాడు. సాయంత్రం రోడ్డు పై నడుచుకుంటు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు.108 వాహనంలో అతడిని మెదక్ ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్ తెలిపారు.

అదుపు తప్పిన బైక్..

హత్నూర(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని సాదుల్లానగర్ గ్రామానికి చెందిన దండు కృష్ణ తన బైక్‌పై దౌల్తాబాద్ నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. తెలంగాణ తల్లి చౌరస్తా సమీపంలో ఓ వృద్ధుడిని తప్పించబోయి అదుపుతప్పి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ లో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చోరీకేసులో మహిళకు జైలు, జరిమానా

వర్గల్(గజ్వేల్): పనిఇస్తానని మహిళను మోసగించడమేకాకుండా చోరీకి పాల్పడిన మహిళకు కోర్టు ఏడాది కఠిన కారాగార శిక్ష, జరిమానా విధించింది. గురువారం గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా జీడిమెట్ల మార్కండేయనగర్‌కు చెందిన కైరంకొండ సంతోషి(38) జనవరి 24వ తేదీన ఫంక్షన్‌లో కూరగాయలు తరిగే పని ఇస్తానని ఇద్దరు మహిళలను నమ్మబలికింది. వారిని వర్గల్ మండలం నాచారం గుట్ట ఆలయప్రాంతానికి తీసుకొచ్చింది. అక్కడ టిఫిన్ చేసిన అనంతరం మద్యం తాగుదామనడంతో ఓ మహిళ నిరాకరించి వెళ్లిపోయింది. మరో మహిళ మద్యం తాగి మత్తులో నిద్రపోయింది. ఆమె మెడలోని రెండు తులాల బంగారు పుస్తెలతాడు, పావు తులం చెవి రింగులు సంతోషి దొంగిలించి పారిపోయింది. పుస్తెలతాడును గాజుల రామారంలో సునీల్ కేభాటి బంగారు దుకాణ యజమానికి రూ.77 వేలకు అమ్మింది. అప్పట్లో బాధితురాలి ఫిర్యాదుమేరకు గౌరారం ఎస్‌ఐ కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. చోరీకి పాల్పడిన సంతోషిని అరెస్ట్ చేసి కోర్టు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును గజ్వేల్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ బి.ప్రియాంక విచారించి నిందితురాలు సంతోషికి ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ. 500 జరిమానా, సునీల్ కే భాటికి రూ. 2 వేల జరిమానా విధించారని ఎస్‌ఐ తెలిపారు.

యాజమాన్యం నోటీసులు ఇవ్వడంతో..

కార్మికుడి ఆత్మహత్య



కృష్ణయ్య (ఫైల్)

పటాన్‌చెరుటౌన్: మరో నెల రోజుల్లో పదవీ విరమణ ఉందని యజమాన్యం నోటీసులు ఇవ్వడంతో ఓ కార్మికుడు పరిశ్రమలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరుకు చెందిన కృష్ణయ్య(58) బతుకుదెరువు కోసం వచ్చి నలగండ్లలో నివాసం ఉంటున్నాడు. పటాన్‌చెరు పారిశ్రామిక వార్డులోని ఎన్విరాటెక్ లిమిటెడ్ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. అయితే అతడి రిటైర్‌మెంట్ మరో నెల ఉండడంతో మరో రెండేళ్ల పొడిగించమని కార్మికుడు పరిశ్రమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాధు సుందర్ ను కోరాడు. గురువారం మధ్యాహ్నం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణయ్యకు నెలరోజుల్లో పదవి విరమణ ఉందని నోటీసులు ఇచ్చాడు. దీంతో మనస్తాపం చెంది పరిశ్రమలో ఉరివేసుకున్నాడు. సమాచారం తెలుసుకునే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే సమాచారం తెలుసుకున్న సీఐటీయూ నాయకులు పరిశ్రమను సందర్శించి యజమాన్యం నోటీసులు ఇవ్వడంతోనే కార్మికుడు మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని, కార్మికుడికి నష్టపరిహారం చెల్లించాలని, నోటీసులు ఇచ్చిన యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిద్దిపేట మార్పు ఒక గొప్ప చరిత్ర..

- తెలంగాణ ఉద్యమానికి ఆయువు పట్టు
- చరిత్రను భావి తరాలకు అందిద్దాం
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



పుస్తకావిష్కరణలో మంత్రి హరీశ్ రావు, నందిని, దేశపతి, రమణాచారి, శివారెడ్డి

సిద్దిపేటజోన్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సిద్దిపేట మార్పు ఒక చరిత్రగా మారుతుందని, సిద్దిపేట ప్రజలు చాలా గొప్పవారని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం రాత్రి స్థానిక విపంచి ఆడిటోరియంలో తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సిద్దిపేట జిల్లా సమగ్ర స్వరూపం అనే గ్రంథావిష్కరణ కార్యక్రమానికి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సిద్దిపేట గురించి ఎంత రాసిన తక్కువేనని, సిద్దిపేట జిల్లా కావడమే ఒక చరిత్ర అన్నారు. సిద్దిపేట జిల్లా సమగ్ర స్వరూప పుస్తకం రావడం సంతోషంగా ఉందన్నారు. ఆరు దశాబ్దాల తెలంగాణ కలను, మూడు దశాబ్దాల సిద్దిపేట జిల్లా కలను నిజం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ఈ మట్టి బిడ్డగా కావడం అదృష్టమన్నారు. సిద్దిపేట ప్రజలు గొప్పవారని, వారు చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. తొలి, మలి తెలంగాణ ఉద్యమంలో సిద్దిపేట పాత్ర కీలకమన్నారు. తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేట కేంద్ర బిందువుగా అభివర్ణించారు. శాసన సభలో ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, ఉప సభాధిపతులను అందించిన మట్టి సిద్దిపేట అని, కేసీఆర్, మదన్ మోహన్, ఐరేని లింగయ్య గురించి వివరించారు. సేవా భావంతో ప్రజల కోసం సిద్దిపేట ఎమ్మెల్యేలు పనిచేశారన్నారు. అన్ని రంగాల్లో సిద్దిపేట అగ్రగామిగా ఉందన్నారు. సాహిత్యరంగంలో కూడా సిద్దిపేట ఉన్నత శిఖరాలు అధిరోహించిందన్నారు. ఒకప్పుడు తాగునీరు లేని గడ్డగా ఉన్న సిద్దిపేట నేడు రిజర్వాయర్ ఖిల్లాగా మారిందని, కాళేశ్వరం ప్రాజెక్టుల ద్వారా గోదావరి నీరు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. 1969లో తొలి తెలంగాణ ఉద్యమంలో మదన్‌మోహన్‌కు అండగా నిలిచిన సిద్దిపేట, మలి విడత తెలంగాణ ఉద్యమానికి పూర్తి ఆయువు పట్టుగా మారిందన్నారు. ఉప ఎన్నికల్లో ప్రతీసారి సిద్దిపేట అండగా నిలిచిన విషయం గుర్తు చేశారు. తెలంగాణ రాష్టానికి సిద్దిపేట దిక్సూచిగా అభివర్ణించారు. సిద్దిపేట జిల్లా సమగ్ర స్వరూపం పేరిట పుస్తకం రావడం ఒక అడుగు లాంటిదని, దీన్ని భావి తరాలకు అందించే బాధ్యత ప్రతీఒకరిపై ఉందన్నారు. సిద్దిపేట చరిత్రను మరింత విస్తృతం చేద్దామని, పుస్తకం వేసిన ప్రతీ ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. అంతకుముందు సీఎం కార్యాలయ ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, ప్రముఖ కవి నందిని సిధారెడ్డి, ప్రభుత్వ సలహాదారు రమణాచారి, పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రతినిధులు కొండి మల్లారెడ్డి, అంజయ్య, అశోక్, యాదగిరి, రాజేశం, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, శర్మ, రాజనర్స్ తదితరులు పాల్గొన్నారు.